సాక్షి
విజయనగరం

గురువారం । 6 । జూన్ । 2024



పిడుగుల వానతో జాగ్రత్త

ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరుతున్నాయి. వాతా వరణంలో పెనుమార్పులు సంభవిస్తు న్నాయి.

- 8లో



పింఛన్ కోసం పాట్లు - 8లో

ఇంతవరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటవ తేదీన తెల్లవారేసరికి పింఛన్ అందించే కార్యక్రమం ఆగిపోయింది.



నిషేధిత క్రిమిసంహారక మందు అక్రమ రవాణా - 8లో

రాష్ట్రంలో నిషేధించిన గడ్డిమందు గ్లైసిల్‌ను ఒడిశా నుంచి అక్రమంగా తరలిస్తున్నారు.

న్యూస్‌రీల్

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు

విజయనగరం: భారత ప్రభుత్వం ఏటా గణ తంత్ర దినోత్సవం రోజున ప్రదానం చేసే అత్యున్నత పద్మ పురస్కార్యాల కోసం 2025 సంవత్సరానికి అర్హత కలిగిన క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ పురస్కారాలకు అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు అర్హులుగా పేర్కొన్నారు. దరఖాస్తు వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పద్మ అవార్డ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చని సూచించారు. అర్హత గల వారు ఆగస్టు1వ తేదీలో తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు కేంద్ర ప్రభుత్వంచే తగిన గుర్తింపు పొందేందుకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక కళా ప్రదర్శనలో ఎన్‌సీసీ క్యాడెట్స్

విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 8 రోజులుగా జరుగుతున్న 2(ఏ) గర్ల్స్ బెటాలియన్ ట్రైనింగ్ క్యాంపులో భాగంగా బుధవారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను అలరించాయి. గ్రూప్ డ్యాన్స్‌లు, గ్రూప్ సింగింగ్, నటనా ప్రదర్శనలతో క్యాడెట్స్ ఆకట్టుకున్నారు. ప్రతిభ చూపిన క్యాడెట్‌లకు ఎన్‌సీసీ అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కల్నల్ గోపేంద్ర, 13(ఏ) కమాండింగ్ ఆఫీసర్ లెఫ్ట్‌నెంట్ కల్నల్ నీరజ్ కుమార్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, డాక్టర్ ఎం.సాయిదేవమణి, బండారు కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపు



ఈవీఎంల తరలింపులో రెవెన్యూ అధికారులు, సిబ్బంది

విజయనగరం అర్బన్: ఎన్నికల లెక్కింపు ప్రక్రియ పూర్తి కావడంతో లెండీ, జేఎన్‌టీయూ కళాశాలల నుంచి ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లను గోదాములకు తరలించారు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో బుధవారం ఉదయం ఈ ప్రక్రియ సాగింది. నెల్లిమర్లలోని ఈవీఎం గోదాముల్లో ఒక్కో నియోజకవర్గానికి రెండు గదులను సిద్ధం చేసి, పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఈవీఎం మిషన్లను వేర్వేరుగా భద్రపరిచారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలను తరలించారు. పోస్టల్ బ్యాలెట్‌ను కూడా జిల్లా ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి భద్రపరిచారు. ఈ ప్రక్రియలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

- డీఈఓ ప్రేమకుమార్



మొక్కలను నాటుతున్న విద్యాశాఖాధికారి ప్రేమకుమార్

బొండపల్లి: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ తలో మొక్కను నాటి సంరక్షించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ పిలుపునిచ్చారు. బొండపల్లి మండలం రాచకిండాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవజాతి మనుడగకు ఆధారం చెట్టేనన్న విషయాన్ని ప్రతీ విద్యార్థికి ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి.సన్యాసిరాజు, సిబ్బంది కె.వి.రమణ, సిందూజ, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కే వేశాం.. కానీ?



సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై సామాన్యుల్లో ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికమంది ఫ్యాన్‌కు ఓటేస్తే.. కూటమి అభ్యర్థికి ఎలా పద్దాయంటూ గ్రామాల్లోని రచ్చబండలపై చర్చ జోరుగా సాగుతోంది. కొన్ని గ్రామాల్లో శతశాతం వైఎస్సార్‌సీపీ అభిమానులు ఉన్న చోట కూడా సైకిల్ గుర్తుకు వందల్లో ఓట్లు రావడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇలా ఎలా సాధ్యమైందంటూ ఆయా గ్రామాల ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. అందరమూ ఫ్యాన్ గుర్తుకే ఓటేస్తే.. కూటమి అభ్యర్థులకు మెజార్టీ ఎలా వచ్చిందంటూ నాయకులు, ప్రజలు ఓ చోటకు చేరి తర్కిస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, నిరక్షరాస్యులు ఓటు వేసేందుకు వెళ్లే సమయంలో పోలింగ్ కేంద్రంలో ఏమైనా మతలబు జరిగిందా? లేదంటే ఈవీఎంలలో ఏమైనా లోపాలు ఉన్నాయా అన్న సందేహం వ్యక్తంచేస్తున్నారు. ఏదేమైనా ఫలితాలు భిన్నంగా ఉన్నాయని, ఓటర్లు ఓ వైపు ఉంటే.. ఓట్లు మరోవైపు పద్దాయని, దీనిపై ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్న వాదన గట్టిగా వినిపిస్తోంది. ఎన్నికల కమిషన్ దృష్టిసారిస్తే నిజాలు బయటకు వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

– సాక్షి నెట్‌వర్క్

అనుమానాలు ఉన్నాయి



ఎన్నికల ఫలితాలపై అనుమానాలు ఉన్నాయి. నాతో పాటు మా ఊరిలో అత్యధిక మంది వైఎస్సార్ సీపీకి ఓటు వేశాం. ఫలితాలు ఎందుకు ఇలా వచ్చాయో అర్థం కావడం లేదు. ఫలితాల సందేహాలను ఎన్నికల కమిషన్ నివృత్తి చేయాలి.

– కునుకు వెంకటరావు, సర్పంచ్, గుంకలాం, విజయనగరం జిల్లా

కుట్ర పూరితమే!



మా గ్రామంలో నాలుగు పోలింగ్ బూతులున్నాయి. మొత్తం 3,417 ఓట్లు పోలయ్యాయి. చాలా ఓట్లు టీడీపీకి వెళ్లాయి. పోలింగ్ కేంద్రంలో పనిచేసే సిబ్బంది ఓటర్ల నాడికి వ్యతిరేకంగా పోలింగ్ జరిగేలా సహకరించారనిపిస్తోంది. కేవలం కుట్ర పూరితమైన ఎన్నికల్లా ఉన్నాయి. ఇది చంద్రబాబు, స్థానిక బొబ్బిలి రాజులు చేసిన కుట్రనే అనిపిస్తోంది. ఇంత దారుణం ఎక్కడా చూడలేదు. ప్రజాస్వామ్య బద్ధంగా ఈ ఎన్నికలు జరుగలేదు. ఈసీ దృష్టి సారించాలి.

– సీర తిరుపతినాయుడు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి, అలజంగి, బొబ్బిలి మండలం

ఇది ఎలా సాధ్యం?



మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో మేమంతా ఫ్యాన్ గుర్తుకే ఓటు వేశాం. జగన్ మోహన్‌రెడ్డిని సీఎం చేద్దామనే దృఢ సంకల్పంతో మా పంచాయతీలో 70 శాతం మంది ఓటర్లు ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి మద్దతు తెలిపామని చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో మా పంచాయతీలో 3,686 ఓట్లు పోల్ కాగా, ఇందులో 2 వేలకు పైబడి ఓట్లు వైఎస్సార్ సీపీకే రావాల్సి ఉంది. కానీ ఫలితాలు చూసే సరికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కేవలం 1507 ఓట్లు, టీడీపీకి 2,042 ఓట్లు వచ్చాయి. ఇది ఎలా సాధ్యమైందో నాకు అర్థంకావడం లేదు. అంతా అయోమయంగా ఉంది.

– నక్క వర్షిణి, వైస్ ఎంపీపీ, బొద్దాం గ్రామం, రాజాం

జిల్లేడు వలస వైఎస్సార్‌సీపీది



పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం జిల్లేడు వలస గ్రామం మొత్తం ఓట్లు 363. గ్రామస్తులందరూ వైఎస్సార్‌సీపీ అభిమానులు. ఇక్కడ వైఎస్సార్‌సీపీకి 98 ఓట్లు, టీడీపీకి 167ఓట్లు వచ్చాయి. వీటిని చూస్తే ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈవీఎంలపై అనుమానం వ్యక్తమవుతోంది. దీనిపై ఈసీ దృష్టి సారించాలి.

– దండి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు, జిల్లేడువలస

ఆశ్చర్యం కలిగిస్తోంది



ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. 2014లో గుమ్మలక్ష్మీపురం మండలం నుంచి వైఎస్సార్‌సీపీకి 9వేల పైచిలుకు మెజార్టీ ఓట్లు, 2019లో 12వేల పైచిలుకు మెజార్టీ దక్కింది. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమాభివృద్ధి పథకాలు ప్రతీ గడపను తాకాయి. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన లబ్ధిని పొందారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఎంతో సానుకూలతా చూపారు. గతానికి మించి మెజార్టీ వస్తుందని దృఢంగా నమ్మాం. కానీ, ఫలితాలు చూస్తే తారుమారయ్యాయి. తీవ్ర ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అనుమానాలకు తావునిస్తోంది.

– కె.దీనమయ్య, ఎంపీపీ, గుమ్మలక్ష్మీపురం

ఏదో జరిగింది..?



సార్వత్రిక ఎన్నికల్లో నాతో పాటు మా గ్రామస్తుల్లో అధిక శాతం మంది ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నకు మద్దతు తెలిపారు. ఈ ఎన్నికల్లో మా గ్రామ పంచాయతీ నుంచి 990 ఓట్లు పోల్‌కాగా, ఇందులో 7 వందలకు పైగా ఓట్లు వైఎస్సార్‌సీపీకి రావాల్సి ఉంది. కానీ ఫలితాలు చూసేసరికి వైఎస్సార్ సీపీకి కేవలం 402 ఓట్లు, టీడీపీకి 588 ఓట్లు వచ్చాయి. ఇది అనుమానాన్ని కలిగించే అంశం. ఎలాగైనా జగనన్నను ఓడించాలని ఎక్కడో కూటమి నాయకులు మోసం చేశారనిపిస్తోంది. పోలింగ్‌కేంద్రం, ఈవీఎంలలో ఏదో జరిగి ఉంటుంది.

– మిత్తిరెడ్డి రమేష్, పోరలి గ్రామం, దత్తిరాజేరు మండలం, విజయనగరం జిల్లా

అన్ని ఓట్లు ఎలా?



ఎన్నికల ఫలితాలు ప్రజలందరినీ తీవ్ర ఆశ్చర్యానికి గురిచేశాయి. మాది పార్వతీపురం మండలం లక్ష్మీనారాయణపురం గ్రామం. మా గ్రామం వైఎస్సార్‌సీపీకి కంచుకోటలా ఉండేది. మా గ్రామంలో 620 ఓట్లు పోలయ్యాయి. మేమంతా జగన్‌మోహన్ రెడ్డికి అనుకూలంగానే ఓట్లు వేశాం. వైఎస్సార్‌సీపీకి 247, టీడీపీకి 373 ఓట్లు పడ్డాయి. ఇంతలా వ్యత్యాసం ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు. గ్రామమంతా ఇదే చర్చ నడుస్తోంది. అత్యధికంగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేశామంటున్నారు. టీడీపీకి 373 ఓట్లు రావడంపై చర్చనీయాంశంగా మారింది.

– జక్కు ప్రవీణ్, సర్పంచ్, లక్ష్మీనారాయణపురం

భిన్నమైన ఫలితాలు



తాజాగా మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఫలితాలు చూస్తే ఆశ్చర్యం కలిగిస్తోంది. నూరు శాతం వైఎస్సార్‌సీపీ మద్దతు ఉన్న గ్రామాల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలిపినప్పటికీ ఫలితాలు చూస్తే అందుకు భిన్నంగా ఉండడం అనుమానాలకు తావిస్తోంది. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలంలోని రామలింగాపురం పంచాయతీ సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నాం. ఇక్కడ 2019 ఎన్నికల్లో 400కు పైగా మెజారిటీ వచ్చింది. తాజాగా జరిగిన ఎన్నికల్లో పోలింగ్ బూత్ నంబర్ 160లో మొత్తం 578 ఓట్లకు 497 పోలయ్యాయి. అలాగే, బూత్ నంబర్ 161లో 548 ఓట్లకు 473 పోలయ్యాయి. దీంతో రామలింగాపురం గ్రామంలో మొత్తం 970 ఓట్లు పోలవ్వగా అందులో 400కు పైగా వైఎస్సార్ సీపీకి మెజారిటీ రావాల్సి ఉంది. కేవలం 76 ఓట్లు మాత్రమే మెజారిటీ రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

– ఇప్పిలి అనంతం, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు, చీపురుపల్లి

ప్రజల పక్షాన నిలబడతాం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

- గడిచిన ఐదేళ్లలో ప్రకటించిన హామీలను అమలు చేశాం
- కూటమి నేతలు ప్రకటించిన హామీలన్నీ నెరవేర్చాలి
- హామీల అమలుకోసం ప్రజాక్షేత్రంలో పోరాటానికైనా సిద్ధం
- జిల్లా అభివృద్ధిలో కొత్త ప్రభుత్వానికి సహకరిస్తాం
- ఓటమికి గల కారణాలపై సమీక్షించుకుని భవిష్యత్‌లో ముందడుగు
- ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

విజయగనరం: ప్రజాస్వామ్యంలో ప్రజల ఇచ్చిన తీర్పుకు కట్టుబడి ఉన్నామని, రానున్న ఐదేళ్లలో ప్రజల పక్షాన నిలబడతామని, కూటమి నేతలు ప్రకటించిన హామీల అమలు కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాక్షేత్రంలో పోరాటం చేసేందుకైనా సిద్ధంగా ఉన్నామని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ధర్మపురిలోని సిరిసహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఊహించనలవిగా ఉన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీతో పాటు కూటమి నేతలు ఈ తరహా ఫలితాలు వస్తాయని అనుకోలేదని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని స్పష్టంచేశారు. ప్రజాభీష్టానికి అనుగుణంగా పాలన సాగించామని భావించి ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ప్రజలు అనూహ్య తీర్పునిచ్చారన్నారు. ఓటమికి గల కారణాలపై సమీక్షించుకుని రానున్న రోజుల్లో ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ముందడుగు వేస్తామని చెప్పారు.

హామీలన్నీ అమలుచేస్తారని ఆశిస్తున్నాం..

2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ గడిచిన ఐదేళ్లలో అమలు చేశారని, 2024 ఎన్నికల్లో కూటమి నేతలు ప్రకటించిన హామీలన్నీ అమలు చేస్తారని ఆశిస్తున్నామని జెడ్పీ చైర్మన్ అన్నారు. ప్రజల అప్పగించిన బాధ్యతను టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. ముందుగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలకు అభినందనలు తెలిపారు. రానున్న కాలంలో జిల్లా అభివృద్ధి కోసం జిల్లా పరిషత్ తరఫున సహకరిస్తామని చెప్పారు. గడిచిన ఐదేళుగా ప్రజలకు చేరువైన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను కొనసాగించాలని ఆకాంక్షించారు.

నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటాం...

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తియ్యేంత వరకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపుకోసం ఆహర్నిశలు శ్రమించిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు మజ్జి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఓటమి పట్ల నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. నిరుత్సాహ పడకుండా పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేద్దామని సూచించారు. రానున్న రోజుల్లో ప్రజల మనోభావాలకు అనుగుణంగా ముందడుగు వేసేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, బూర్లె నరేష్‌కుమార్, పీరుబండి జైహింద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం

- నూతన ఎమ్మెల్యేలను, ఎంపీ గుమ్మ తనూజా రాణికి శుభాకాంక్షలు తెలిపిన అలజంగి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. తన స్వగృహంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. ఎన్నికల ఫలితాల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎన్నికైన ఎమ్మెల్యేలకు, అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నికల్లో అండగా నిలిచిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథరావు, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాను

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు భరోసా
- సాలూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన సంధ్యారాణికి అభినందనలు
- టీడీపీ మేనిఫెస్టోను అమలుపర్చి ప్రజలకు సుపరిపాలన అందించాలని సూచన
- 2029 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశిస్తే మరలా ఎమ్మెల్యేగా నిలబడతా
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు:

ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, ప్రజలు అధైర్యపడొద్దని, మీ అందరికీ అండగా ఉంటానని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర స్పష్టం చేశారు. సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో పార్టీ శ్రేణులతో బుధవారం సమావేశమయ్యారు. ఓటమితోనే రాజకీయ ప్రస్థానం ఆరంభమైందని, అనంతరం నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఉపముఖ్యమంత్రిగా, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసినట్టు గుర్తుచేశారు. సాలూరు నియోజకవర్గంలో కోట్లాది రూపాయల ఖర్చుతో సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించామని వివరించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఎల్లప్పుడూ ప్రజలతోనే ఉంటామని పునరుద్ఘాటించారు. ఎమ్మెల్యేగా గెలిచిన సంధ్యారాణికు అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రశాంతయుత వాతావరణంలో పాలన సాగించాలని హితవు పలికారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నేను హుందాగానే రాజకీయాలు చేశానని, ప్రతిపక్షాల సభ్యులను గౌరవించానన్నారు. భంజ్‌దేవ్‌గాని, మరే టీడీపీ నాయకులనన్నెప్పుడూ విమర్శించలేదని తెలిపారు. ఆ మాదిరిగానే అందరూ గౌరవప్రదమైన రాజకీయాలు చేయాలని ఆకాంక్షించారు. ఎన్నికల్లో అండగా నిలిచిన పార్టీ శ్రేణులకు, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్‌సిక్స్ పథకాలు అందించడం, ఇచ్చిన హామీలను అమలుచేస్తూ ప్రజలకు మంచిగా పాలన అందించాలని సంధ్యారాణికి కోరారు. ప్రస్తుత ఎన్నికల్లో విజయం సాధిస్తే, తరువాత అసెంబ్లీ ఎన్నికల నుంచి తను వైదొలగాలని భావించానని, అయితే ఓటమి నేపథ్యంలో 2029లో జరగనున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశిస్తే మరలా సాలూరు అసెంబ్లీ నుంచి పోటీ చేస్తానని స్పష్టం చేశారు.

పర్యావరణ హితమే.. కావాలి మన అభిమతం

- పాఠశాలల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు ప్రారంభం
- జిల్లాలో 299 స్కూళ్లలో విద్యార్థులకు వారం రోజులపాటు నిర్వహణ
- కార్యక్రమాల షెడ్యూల్ విడుదల
- ప్రతి ఒక్కరినీ చైతన్య పరచడమే లక్ష్యం



రాచకిండాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఈఓ ఎన్.ప్రేమకుమార్

విజయనగరం అర్బన్:

పర్యావరణంపైనే మానవ మనుగడ ఆధారపడి ఉంది. దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది. ఓ వైపు ప్లాస్టిక్ వ్యర్థాల వ్యాప్తి, మరో వైపు చెట్లను నరకడం, ఏసీల విపరీత వాడకంతో వాతావరణ కాలుష్యం రెట్టింపు అవుతోంది. విపత్తులు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ తమ పరిధిలో పుడమితల్లిని కాపాడుకునేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందంటూ ప్రపంచ వ్యాప్త ఉద్యమం ఊపందుకుంది. ఏటా జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి అనుబంధంగా ఇంటర్ ప్యానెల్ ఇన్ క్లైమేట్ ఛేంజ్ (ఐపీసీసీ) పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించింది. అందులో భాగంగా పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను చైతన్యవంతం చేసేందుకు పొల్యూషన్ బోర్డు, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ, విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఈ నెల 5 నుంచి 19 వరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది.

తేదీల వారీగా అవగాహన కార్యక్రమాలు ఇలా...

- తొలిరోజు బుధవారం ప్లాస్టిక్‌ను పరిహరించే కార్యక్రమాలను నిర్వహించారు. పర్యావరణ అనుకూల వస్తువులను వాడడం, ప్లాస్టిక్ వస్తువుల సంఖ్య నోట్ చేయడం, జనపనార వస్తువుల వాడకం, పర్యావరణ అనుకూల అలవాట్లను పెంపొందించడం వంటి అవగాహన కార్యక్రమాలను విద్యార్థులతో చేపట్టారు.
- 12న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో పాఠశాలల్లో నీటి లీకేజీని అరికట్టడం, పైపుల లీకేజీని తనిఖీ చేయడం, నీటి స్వచ్ఛత పరీక్షల నిర్వహణ, నీటి సంరక్షణ ర్యాలీ, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 13న విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఎనర్జీ సేవింగ్ యాక్టివిటీస్, ఎనర్జీటీమ్, ఎకోక్లబ్ ఎనర్జీ టీమ్‌తో డ్యూటీ రోస్టర్, నాలెడ్జ్ బిల్డింగ్ సెషన్లు, బ్యానర్లు, ఇతర విజువల్ మెటీరియల్ క్రియేట్ చేయడం, డిస్‌ప్లే బోర్డులు పోస్టు చేయడం వంటి కార్యక్రమాలు చేపడతారు.
- 14న పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో శుభ్రత, వ్యర్థాలను వేరు చేయడం, తరగతి గదుల్లో రెండు బిన్ వ్యవస్థలు, శానిటరీ వ్యర్థాలు, కంపోస్ట్ పిట్లు, వస్త్రాలు, బొమ్మలు వంటి వివరాల డ్రైవ్‌లు నిర్వహించడం, కమ్యూనిటీ సభ్యులతో ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించడం (కంపోస్ట్ పిట్ల సంఖ్య సేంద్రియ వ్యర్థాలను వేరుచేయడం) వంటి కార్యక్రమాలను చేపడతారు.
- 15న పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో వ్యర్థాలను సేకరించడం, భూమిపై ఈ వ్యర్థాల ప్రభావంపై పిల్లలతో చర్చించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 18న స్థిరమైన ఆహారం వ్యవస్థలో భాగాంగా కిచెన్ గార్డెన్‌లను అభివృద్ధి చేయడం, వ్యర్థాలతో పర్యావరణ అనుకూల ఎరువుల తయారీ, మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.
- 19న ఆరోగ్యకర జీవనశైలిని అలవాటు చేయడంలో భాగంగా నేచర్ వాక్, ప్లాంటేషన్ డ్రైవ్, పర్యావరణ శాస్త్రం, చరిత్ర, భౌగోళిక ఆచారాలు, సంప్రదాయాలను పరిశీలించేందుకు సమీప గ్రామాలకు అన్వేషణ, సందర్శనలు వంటి కార్యక్రమాలను చేపడతారు.

క్లుప్తంగా

నిషేధిత క్రిమిసంహారక మందు అక్రమ రవాణా


ఒడిశా నుంచి ప్రైవేట్ బస్సులో తరలించిన నిషేదిత గడ్డి మందు గ్లెసైల్ బాక్సులు

కురుపాం: రాష్ట్రంలో నిషేధించిన క్రిమిసంహారక (గడ్డిమందు) మందు గ్లెసైల్‌ను ఒడిశా నుంచి కురుపాం మండల కేంద్రానికి ప్రైవేట్ బస్సుల్లో తరలిస్తున్నారు. గపచుప్‌గా స్థానిక వ్యాపారులు విక్రయాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్లెసైల్ క్రిమిసంహారక మందు చాలా ప్రమాదకరం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం నిషేదించింది. అప్పటి నుంచి ఎవరైనా మార్కెట్లో క్రయ విక్రయాలు చేస్తే అటువంటి వారిపై కేసులు కూడా పెట్టేవారు. ముఖ్యంగా గ్లెసైల్ క్రిమిసంహారక మందు తీసుకుని ఆత్మహత్యలు కూడా చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిషేధిత క్రిమిసంహారక మందు ఒడిశా నుంచి అక్రమంగా రాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

సీతానగరం: మండలంలోని పెదభోగిలి పంచాయతీ హడ్కోకాలనీలో తమ్ముడు గుజ్జల హేమంత్‌ను హత్యచేసినట్లు వచ్చిన అభియోగంపై నిందితుడు, హతుడి అన్నయ్య గుజ్జల రవీంద్రకుమార్‌ను బుధవారం ఉదయం పార్వతీపురం రూరల్ సీఐ కె రవికుమార్ అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకు ఎస్సై ఎం.రాజేష్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం గుజ్జల హేమంత్(42)ను ఆస్తి తగాదా క్రమంలో హతుడి అన్న గుజ్జల రవీంద్రకుమార్ కత్తితో దాడి చేసి హతమార్చినట్లు వివరించారు.

అన్నసమారాధన


అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి, తదితరులు

విజయనగరం టౌన్: పట్టణంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మాసశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి నేతృత్వంలో బుధవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహాశివునికి ప్రీతికరమైన మాసశివరాత్రి రోజున భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భక్తులు, దాతల సహాయ, సహకారాలతో కార్యక్రమాలను నిరివ్ఘ్నంగా చేయగలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమణమ్మ, మారమ్మ, శోభారాణి, భీమరాజు, భరణి, తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాసుల జారీకి అంతరాయం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో బస్‌పాసుల జారీకి అంతరాయం కలుగుతోందని ఆర్టీసీ డిపో మేనేజర్ కనకదుర్గ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు, పాసులపై ప్రయాణం చేసే ప్రయాణికులకు, బస్ పాసుల జారీ చేసే విధానం, సులభతరం చేసేందుకు బస్ పాస్ వెబ్‌సైట్‌ను అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. ఈ నెల 6 నుంచి 7వ తేదీ వరకు ప్రస్తుతం పని చేస్తున్న వెబ్‌సైట్‌ను నిలుపుదల చేసినట్లు చెప్పారు. పార్వతీపురం బస్‌స్టేషన్‌లో ఉన్న, బస్‌పాస్ కౌంటర్ వద్ద రెండు రోజులు పాస్‌ల పంపిణీ నిలుపుదల చేశామన్నారు. 8వ తేదీ నుంచి యథావిధిగా బస్‌పాస్‌లు జారీ చేస్తామని, వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

చిత్రలేఖనంపై దృష్టి సారించండి

• లైబ్రేరియన్ కృష్ణమూర్తి


తెర్లాం : చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తెర్లాం: విద్యార్థులు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే చిత్రలేఖనంపై దృషి సారించాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బొమ్మలు వేయడంలో మెలకువలు నేర్చుకుంటే, ఉన్నత చదువులు చదివేటప్పుడు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ క్రాఫ్టుపాధ్యాయుడు విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270

పిడుగుల వానతో జాగ్రత్త

- కర్షకులపై పడుతున్న పిడుగులు
- జాగ్రత్తలు పాటించాలని వాతావరణ నిపుణుల సూచన


ఇటీవల కొత్తవలస పరిసర ప్రాంతలో పడిన పిడుగుకు కాలిపోతున్న కొబ్బరిచెట్టు


పిడుగులు వచ్చే సమయంలో మెరుపులు

లక్కవరపుకోట: ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరుతున్నాయి. వాతా వరణంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయి. ఉరుములతో కూడిన వర్షం, పిడుగులు పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు, నిర్వహణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఏ ప్రాంతంతో పిడుగులు పడతాయోనని ఒక ఆరగంట ముందే ఆప్రాంతంలో గల సెల్‌ఫోన్‌లకు విపత్తు, నిర్వహణశాఖ వారు మెసేజ్‌లు పెడుతున్నారు. ముఖ్యంగా పిడుగులు పడే సమయంలో సెల్‌ఫోన్‌లు వినియోగించేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం వచ్చే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడుతుంటాయి. పిడుగుపాటు వల్ల విడుదలయ్యే పెద్ద పెద్ద ధ్వనులు, వెలుతురుతో పాటు విద్యుత్ శక్తి విడుదలవుతుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పిడుగుపాటు బారి నుంచి తప్పించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకోవాలి

పిడుగుపాటు నుంచి తప్పించుకునేందుకు ఎత్తైన ప్రదేశాల నుంచి నేరుగా భూమిలోకి లైట్నింగ్ కండక్టర్ ఏర్పాటు చేసుకోవాలి.దీన్ని ఏర్పాటు చేసుకోవడం వలన పిడుగులో ఉన్న విద్యుదావేశం భూమిలోకి ఆకర్షించుకుంటుంది. ఎత్తైన కట్టడాలు చేసినప్పుడు ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

అప్రమత్తతే శ్రీరామ రక్ష

మెరుపులు, ఉరుములు వచ్చే సమయంలో చెవులు గట్టిగా మూసుకోవాలి. పిడుగు శబ్దంతో వినికిడి శక్తి కోల్పోయే ప్రమాదం ఉంది.

ఉరుములు, మెరుపుల సమయంలో సురక్షిత ప్రాంతానికి వెళ్లే అవకాశం లేపోతే నేలమీదకు పూర్తిగా కిందకు వంగాలి. నేలపై పడుకోకూడదు. నేలపై కూర్చున్నప్పుడు పాదాల ముందుభాగం మాత్రమే నేలను తాకాలి. శరీరంలోని మరే ఇతర భాగం నేలను తాకకుండా చూసుకోవాలి.
పాదాల మడమల ముందు ఒకదానిని ఒకటి తాకేలా ఉండాలి. అలా చేయడం వల్ల పిడుగు పడే సమయంలో నేలపై పడి దాని విద్యుత్ శక్తి ఒక పాదం నుంచి శరీరంలోకి ప్రవహించినా వెంటనే రెండో పాదం నుంచి తిరిగి భూమిలోకి ప్రవేశిస్తుంది.శరీరంలోకి విద్యుత్ ప్రవహించే అవకాశాలు తగ్గుతాయి.

ఇళ్లకు విద్యుత్ కరెంట్ ఎర్త్ ఏర్పాటు

మేఘాలు దట్టంగా కమ్ముకున్నప్పుడు, పిడుగులు పడతాయనే ఆలోచనకు రావాలి.
- కళ్లు మూసుకోవడం వల్ల ప్రసారకాంతి నుంచి తప్పించుకోవచ్చు. భూమిపై ఉన్న ఎలాంటి లోహాలను తాకకూడదు.
- పొలాల్లో ఆరుబయట ఉన్నప్పుడు చెట్ల కిందికి వెళ్లకూడదు. ఎత్తైన చెట్లు, స్తంభాలు పిడుగులను ఆకర్షిస్తాయి.


పిడుగుపాటుకు నిడుగట్టు గ్రామంలో మృతి చెందిన పాడిగేదె (ఫైల్)

ప్రథమ చికత్స ఇలా చేయాలి

పిడుగుపాటుతో అస్వస్థతకు గురైన వారిని వెంటనే గాలి, వెలుతురు తగిలే విశాలమైన ప్రాంతంలో ఉంచాలి.
- తడి దుస్తులు తొలగించి పొడి దుస్తులు వేయాలి.
- తిన్నగా పడుకోబెట్టి, రెండుకాళ్లు పైకి ఎత్తి ఉంచాలి.
- తలను ఒకవైపు తిప్పి పెట్టాలి.
- అసమయంలో నోటిద్వారా నీరు, ఇతర ఎలాంటి ఆహారాన్ని అందించకూడదు.
- వెంటనే అందుబాటులో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యసేవలు అందించాలి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలోని వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మే, జూన్ నెలల్లో ఎక్కువగా పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. విపరీతంగా పెరుగుతున్న ఉష్ణాగ్రతలతో పాటు క్యూములో నింబస్ మేఘాల కారణంగా పిడుగులు పడే ప్రమాదం ఉంది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. వర్షం వస్తున్నట్లు ముందే తెలుస్తుంది కాబట్టి వీలైనంత వరకు ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా ఉంటే మంచిదని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఏం చేయకూడదు?

- వర్షం కురిసేటప్పుడు చెట్ల కింద నిలబడరాదు.
- ఉరుములు,మెరుపులు వచ్చే సమయంలో రైతులు పొలాల్లో ఉండకూడదు.
- పెద్ద మెరుపు కనిపించిన తరువాత 30 నిమిషాల వరకు బయటకు వెళ్లకూడదు.
- ముఖ్యంగా ఆసమయంలో సెల్‌ఫోన్‌లు స్విచాఫ్ చేసుకోవాలి. లేదంటే రేడియేషన్ తరంగాలకు గురై ప్రమాదం ఉంది.
- వర్షం పడే సమయంలో విద్యుత్ తీగల కింద, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ దగ్గరగా ఉండకూడదు.
- ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెప్పులు లేకుండా వెళ్లకూడదు.
- "గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో భయాందోళనకు గురయ్యే ఆస్కారం ఉంది. ధైర్యంగా ఉండాలి.

నీట్-2024 పరీక్షలో ర్యాంకులు


తల్లిదండ్రులతో సీహెచ్ వేదాంత్ సంతోష్


తల్లిదండ్రులతో సాహితి శివాని


పొట్నూరి సాయి కృష్ణ


గుల్ల పవిత్ర


పొట్నూరు మైఖేల్


దోకుల శరణ్య


ఒలిగంటి సందీప్ శామ్యూల్

విజయనగరం అర్బన్: వైద్యకళాశాలలో ప్రవేశాలకు సంబంధించి జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్-2024 ప్రవేశ పరీక్షలో జిల్లా వాసులు పలువురికి ర్యాంకులు లభించాయి. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది రాసిన ఈ పరీక్షలో నెల్లిమర్ల పట్టణానికి చెందిన సీహెచ్.వేదాంత్ సంతోష్ 720 మార్కులకు గాను 700 మార్కులు తెచ్చుకుని జిల్లా స్థాయిలో మొదటి వరుసలో ఉన్నాడు. చీపురుపల్లికి చెందిన రైతు సాయి కృష్ణ 660/720 మార్కులు, విజయనగరం పట్టణంలోని తోటపాలెంకు చెందిన చింతపల్లి సాహితి శివాని 647/720 మార్కులు తెచ్చుకుని తర్వాత స్థానాల్లో ఉన్నారు. అలాగే పట్టణానికి చెందిన గుల్ల పవిత్ర 594/720 మార్కులు, పొట్నూరు మైఖేల్ 552/720 మార్కులు సాధించారు.

సత్తా చాటిన శరణ్య

సీతానగరం: మండలంలోని చినంకలాం గ్రామానికి చెందిన దోకుల శరణ్య నీట్ పరీక్షా ఫలితాల్లో 704వ ర్యాంక్ సాధించినట్లు ఆమె మేనమామ ఎం రామకృష్ణ తెలియజేశారు. ఇంటర్మీడియట్ బైపీసీలో సీబీఎస్సీ విద్యనభ్యసించిన శరణ్య వైద్య కళాశాలలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షల్లో 2041 వ ర్యాంక్(మార్కులు 704)వ సాధించింది.

రాజాం విద్యార్థి ప్రతిభ

రాజాం సిటీ: రాజాం పట్టణానికి చెందిన ఒలిగంటి సందీప్‌శామ్యూల్ ఈ నెల 4న విడుదల చేసిన నీట్ ఫలితాల్లో చక్కని ప్రతిభ కనబరిచాడు. 720 మార్కులకుగాను 663 మార్కులతో ఆలిండియాలో 19152వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో 384వ ర్యాంకు సాధించాడు. విద్యార్థి ర్యాంకు సాధించడంపట్ల తల్లిదండ్రులతోపాటు స్థానికులు అభినందించారు.

విద్యుత్ షాక్‌కు గురైన జేఎల్‌ఎం


భద్రగిరి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జేఎల్‌ఎం ప్రవీణ్

గుమ్మలక్ష్మీపురం: విధి నిర్వహణలో విద్యుత్ సరఫరా చేస్తున్న క్రమంలో విద్యుత్ స్తంభంపై ఉన్న జూనియర్ లైన్‌మన్ (జేఎల్‌ఎం) షాక్‌కు గురయ్యాడు. గుమ్మలక్ష్మీపురం మండలంలో బుధవారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. మండలంలోని తాడికొండ గ్రామంలో విద్యుత్ స్తంభంలో జంపర్ కట్ అవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామస్తుల నుంచి ఈ సమాచారం అందుకున్న తాడికొండ సచివాలయం జేఎల్‌ఎం ఎన్నికల విధులకు వెళ్లిన కారణంగా అందుబాటులో లేకపోవడంతో సమీపంలో గల లుంబేసు గ్రామ సచివాలయంలో జేఎల్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న పెద్దింటి ప్రవీణ్ వెళ్లి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే క్రమంలో స్తంభం పైకి ఎక్కి విద్యుత్ వైర్లను చుడుతుండగా షాక్ తగిలి వైర్లతో పాటు చుట్టుకుపోయాడు. దీంతో పక్కనే ఉన్న మరో జేఎల్‌ఎం వాసు చాకచక్యంగా వ్యవహరించి వైర్లను తప్పించడంతో ప్రవీణ్ కింద పడడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రవీణ్ కుడి చేతికి విద్యుత్ షాక్ వల్ల గాయాలవడంతో హుటాహుటిన భద్రగిరి సీహెచ్‌సీకి తీసుకురాగా వైద్య సేవలు అందించారు.

ఎంజేపీ గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: జిల్లాలోని ఎంజేపీ గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ సీహెచ్ రమామోహిని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 6 నుంచి 9 వతరగతి వరకు ఉన్న మిగులు సీట్లలో ప్రవేశానికి ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే ప్రవేశ పరీక్ష ఈనెల 20న జరుగుతుందని ఖాళీల వివరాలు ఆయా పాఠశాలల్లో పొందుపర్చినట్లు తెలిపారు.

పింఛన్ కోసం పాట్లు


మామిడిపల్లిలో యూనియన్ బ్యాంక్ బయట నిరీక్షిస్తున్న పింఛన్ లబ్ధిదారులు

- బ్యాంక్ బయట నిరీక్షణ

సాలూరు రూరల్: ఇంతవరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటవ తేదీన తెల్లవారేసరికి పింఛన్ అందించే కార్యక్రమం ఆగిపోయింది. ఇప్పుడు పింఛన్ కోసం ఉదయం నుంచి బ్యాంక్‌ల వద్ద క్యూలో నిలబడాల్సి వస్తోంది. 5 రోజులు గడుస్తున్నప్పటికీ పింఛన్ కోసం బ్యాంక్‌ల బయట క్యూలో నిలబడుతున్న వృద్ధులను చూస్తున్న వారంతా వీరికి ఎన్ని కష్టాలు వచ్చాయో అని చర్చించుకుంటున్నారు. బుధవారం సాలూరు మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గల యూనియన్ బ్యాంక్ వద్ద పింఛన్ కోసం లబ్ధిదారులు ఎదురుచూశారు. ఈ విషయంలో జగనన్నను తలుచుకోవడం వారి మాటల్లో స్పష్టమైంది.

దోపిడీ కేసులో నిందితుల అరెస్టు


అరెస్టయిన చేసిన నిందితులతో పోలీసులు


స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, వస్తువులు

రాయగడ: ఒడిశా రాష్ట్రంలోని రాయగడకు సరిహద్దు ప్రాంతమైన పార్వతీపురం మన్యం జిల్లా కెరడ వరకు ఇటీవల జరిగిన పలు దోపిడీ కేసుల్లో శేశిఖల్ పోలీసులు ముగ్గురు నిందితులను బుధవారం అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి చెందిన మీనక సూర్యకుమార్ (37), విశాఖపట్నం జిల్లా ఆరిలోవకు చెందిన పి.చంద్రశేఖర్ (40), సదర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుంబిగుడ ప్రాంతానికి చెందిన సిద్దు మెలక (23), ఉన్నారు. వారి నుంచి 123 గ్రాముల ఆరు బంగారు ముక్కలు, 41.999 గ్రాముల బంగారం గొలుసు, 34.540 గ్రాముల బంగారు మంగళ సూత్రం, 13.110 గ్రాముల బంగారు చైన్, నాలుగు మొబైల్ ఫోన్లు, ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించి ఎస్పీ హరీష్ బుధవారం రాయగడ జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. నిందితులు నిర్మానుష్యమైన ప్రాంతాల్లో కాపు కాసి ద్విచక్రవాహనాలను అడ్డగించి మారణాయుధాలతో బెదిరించి దోపిడీలకు పాల్పడుతుండేవారని చెప్పారు. ఈ క్రమంలో శేశికల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతేడాది నవంబరు నుంచి ఈ ఏడాది మే 5 వరకు ఏడు కేసులు నమోదు కాగా పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకున్నారని, కోర్టుకు తరలిస్తున్నట్లు చెప్పారు.

గ్యాస్ లీకై వంటసామగ్రి దగ్ధం

- తల్లీకొడుకులకు గాయాలు


మంటలు రేగిన వంటగదిలో ఛిద్రమైన సామగ్రి

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామానికి చెందిన మూడడ్ల తిరుపతిరావు ఇంట్లో బుధవారం వంట చేస్తున్న సమయంలో వంటగ్యాస్ వెలిగిస్తుండగా ఏర్పడిన మంటలు రేగడంతో గదిలో ఉన్న సామగ్రి తీస్తుండగా తల్లీకొడుకులు గాయాల పాలయ్యారు. గ్యాస్ లైకై వంటగదిలోఉన్న సామగ్రి మంటల్లో పడిపోవడం వల్ల వాటిని తీయడానికి వెళ్లిన తిరుపతిరావు భార్య పార్వతి, కుమారుడు రాఘవేంద్రరావు మంట కొనలు ఎగిసిపడడంతో పాక్షికంగా గాయాలపాలయ్యారు. గాయాలపాలైన తల్లీ కొడుకులను చికిత్స నిమిత్తం పెదంకలాం పీహెచ్‌సీకి కుటుంబసభ్యులు తరలించారు. సమాచారం మేరకు బొబ్బిలి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలు అదుపులోకి తెచ్చింది. అగ్నిప్రమాదంలో జరిగిన ఆస్తినష్టంపై అంచనా వేసిన నివేదికను తహసీల్దార్ శ్రీనివాసరావుకు సమర్పించామని వీఆర్వో దామోదర నాయుడు తెలిపారు.

బొలెరో ఢీకొని వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు


శ్రీనివాసరావు మృతదేహం


మృతుడు సుబ్బారావు (ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని మరడాం వద్ద జాతీయ రహదారిపై బైక్‌పై స్నేహితులతో కలిసి వెళ్తున్న గొంతెన శ్రీనివాసరావు(24)ను బొలెరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ బుధవారం తెలిపారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కె.కొత్తవలస గ్రామానికి చెందిన స్నేహితుడు ఎస్.సముద్రం వైజాగ్‌లో నివాసం ఉంటున్నాడు. గ్రామానికి వచ్చిన సముద్రం, శ్రీనివాసరావు కలిసి బైక్‌పై విజయనగరం వెళ్తుండగా పెదమానాపురం నుంచి రామభద్రపురం వస్తున్న బొలెరో మరడాం వద్ద ఢీకొనడంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనుక కూర్చున్న స్నేహితుడు సముద్రానికి బలమైన గాయాలు అవడంతో విజయనగరంలోని సర్వజన ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు సముద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆటో ఢీకొని మరొకరు

మండలంలోని జగన్నాథపురం వద్ద మంగళవారం రాత్రి బైక్‌పై వస్తున్న వ్యక్తిని ఆటో ఢీకొనడంతో తలకు దెబ్బ తగిలి మృతి చెందినట్లు ఎస్ బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు. మండలంలోని పి.లింగాలవలస గ్రామానికి చెందిన పరిగి సుబ్బారావు(48) షికారుగంజి కూడలి నుంచి స్వగ్రామం వస్తుండగా జగన్నాథపురం దుర్గమ్మ గుడి వద్దకు వచ్చేసరికి పి.లింగాలవలస నుంచి షికారుగంజి కూడలి వైపు వస్తున్న ఆటో ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లీల, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు నీతికథలు


విద్యార్థులకు నీతి కథలు చెబుతున్న లైబ్రేరియన్ వై.మహేష్

డెంకాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు లైబ్రేరియన్ వై.మహేష్ నీతి కథాలు చెప్పారు. నీతిని పాటించడం వల్ల కలిగే లాభాలను ఆయన వివరించారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారం అందజేశారు.

'ధైర్యాన్ని కోల్పోవద్దు'

నెల్లిమర్ల రూరల్: ఎన్నికల్లో ప్రజా తీర్పును శిరసావహించి పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడ తప్పు జరిగిందో తెలుసుకొని తిరిగి పూర్వ వైభవాన్ని పొందేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు ధైర్యాన్ని కోల్పోవద్దని, పార్టీ పరంగా అందరికీ అండగా నిలబడతామని చెప్పారు. ఎన్నికల్లో సహకరించిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలియజేశారు.